# మహావృక్షాలు

'ఒద్దు బాబూ! నానుచ్చుకోను! అర్ధరూపాయ కాదు, రూపాయ కాదు, అయిదొందలిచ్చినా నానుచ్చుకోను! అంతే! నా మాట ఇనుకో! పట్నం ఎల్లి పోతన్నవ్! అక్కిడ పైసానేందే పిట్ట కూడా కూయదంత! ఇక్కిడ మాకు గెంజినీళ్లతో దినం గడిసిపోద్ది! అక్కిడ నీ కలగవుద్దేటి? మీయమ్మా నాన్నల గురిచ్చి బెంగడిపోమాక! ఆల్లని మావ్ కంటి పాపల్లా సూసుకుంతాం! ఊరంతా - మావంతా - ఉన్నాం కదేటి? నీకు దిగులెందుకంత?... నానుచ్చుకోను... అంతే!..' కంటతడితో కన్నమ్మ ఛెప్పిన మాటలు నేను మర్చిపోలేకపోతున్నాను!

ఎందువల్ల?!...

ఆ రోజు కూడా మర్చిపోలేను. అది నా జీవితాన్ని మలుపు తిప్పిన రోజు. ఉద్యోగం దొరికిన రోజు. ఉద్యోగంలో కొత్తగా చేరడానికి వెళ్ళిన రోజు. మా ఊరికి నన్ను నేను దూరం చేసుకున్న రోజు. అటువంటి రోజుని నేనెలా మర్చిపోగలను? గ్రామీణ జీవితం నుండి నగర జీవితంలోకి - విద్యార్థి జీవితం నుంచి ఉద్యోగ జీవితం లోకి - నన్ను ప్రవేశపెట్టిన ఆ రోజుని నేనెలా మర్చిపోగలను?

మా తలిదండ్రులు వెళ్లొద్దన్నారు.

'వెళ్లొద్దు. ఇక్కడే ఉండిపో. ఇక్కడే ఏదో ఊళ్లో ఉపాధ్యాయుడిగా చేరిపో. మొక్కలను వృక్షాలుగా పెంచినట్లు పిల్లలను మానవ వృక్షాలుగా చేస్తూ నీ జీవితాన్న ప్రయోజనకరం చేసుకో. నువ్వు జీవిస్తూ తోటి మానవుల సేవలో నీ జీవితాన్ని ధన్యత చేసుకో. నీ ఊర్ని నువు బాగుచేసుకో. అభివృద్ధి చేసుకో. ఇదే నా ధన్యత అనీ చూపించుకో. నీ చదువుని - జ్ఞానాన్ని ప్రజల ప్రయోజనానికి సద్వినియోగం చేసుకోగలిగినప్పుడే - అది నిజమైన చదువు, జ్ఞానం అవుతుంది... జీవించడానికి డబ్బు కావాలి. ప్రజా జీవితానికి హానికరం కాకుండా - దోపిడీలు చేయకుండా - కష్టించి శ్రమించి సుఖంగా జీవించగలం. అది సాధ్యమైంది... సుఖమైంది... ప్రయోజనకరమైంది... ఉపాధ్యాయుడిగా నేను అయిదో ఆరో మానవ వృక్షాలను తయారుచేశాను.... గర్విస్తున్నాను.'

ఆ విధంగా మా నాన్నగారు నాకు చాలా చెప్పేరు. నేను చాలా విన్నాను. ఆయన మాటలు నేను పట్టించుకోలేదు! ఎందువల్ల?!...

★ ★ ★

మా నాన్నగారు గర్వంగా చెప్పుకుంటున్న వృక్షాలు - మహావృక్షాలు - నాకు తెలుసు. వారి ఎదుగుదల నాకు తెలుసు. అక్రమాలూ - ఆక్రమణలూ - విస్తరణలూ - చేస్తూ మరే మొక్కా మొలవకుండా, ఎదగకుండా, ఎలా వ్యాపిస్తున్నారో నాకు తెలుసు. ఆ వృక్షాల - మహావృక్షాల - పెనుగాలికి ప్రజలు తట్టుకోలేకపోతున్నారు! నేను మాత్రం ఎలా తట్టుకోగలను?!

బాగుపడాలనుకున్నవాడు బాగుపడ్డమే చేస్తాడు కానీ, మరేదీ చూడడనీ, చేయడనీ కూడా ఎంతో కొంతమేరకు మహావృక్షాల నుంచి విద్యార్థి దశలోనే నేర్చుకున్నాను. సంస్కరణ జీవన జ్ఞానంలో మా తలిదండ్రులు చూసిన స్వప్నజగత్తు కూలిపోతుందనీ, కూలిపోతోందనీ కూడా గుర్తించాను.

నగరం వెళ్ళిపోడానికీ, మంచి ఉద్యోగంలో చేరిపోడానికీ నిశ్చయించుకున్నాను. నాతో వచ్చేయమని ప్రార్థించేను. రానన్నారు.

మాకు ఊరు ఉంది. ఊళ్లో చాలామంది ఉన్నారు. వారిని మేం మా పిల్లల్లా చూసుకుంటాం. వారు మమ్మల్ని తలిదండ్రుల్లా చూసుకుంటారు. మా ప్రశాంత సుఖ జీవనాన్ని పాడుచేసే ప్రయత్నం చేయొద్దు - ఆ విధంగా చెప్పి కన్నీళ్ళతో నన్ను ఆశీర్వదించేరు.

★ ★ ★

మాది చాలా చిన్న ఊరు. నర్సీపట్నానికి ఆరుమైళ్ల దూరంలో ఉంది. రెండు మైళ్ల కాలినడక చేస్తేనే గానీ బస్సు వెళ్ళే రోడ్డు చేరుకోలేం.

ఆ ముందు రోజున వాన పడింది. ఊరు ఊరంతా గరువుల్లోకి వెళ్లిపోయింది. పెట్టెలు మోయడానికి ఎవరూ దొరకలేదు. నేనొక్కణ్నే వాటిని మోయలేను. ఏం చేయాలో ఆలోచిస్తున్నాను. నిజానికి నేను వెళ్ళిపోతున్నట్లు ఎవరికీ తెలీదు. చెప్పలేదు. చెబితే చాలామంది పనులు మానేసి ఉండిపోతారు. వెళ్లొద్దని కూడా వత్తిడి చేస్తారు.

అనుకోకుండా అంతలో ఎందుకో కన్నమ్మ వచ్చింది. ఆమె పేద రైతు కూతురు. పెళ్ళయిపోయింది. పిల్లలు కూడా ఉన్నారు. నేను వెళ్ళిపోతున్నట్లు తెలుసుకుంది. నేను అడక్కుండానే తనంతట తానే వస్తానంది. మేం బయల్దేరాం. పెట్టెలు మోస్తూ కన్నమ్మ నా వెంట నడుస్తోంది. ఏదో బాధతో చాలా దూరం నడిచేను. అకస్మాత్తుగా ఏదో ఆలోచన నా బుర్రలోకి వచ్చేసింది!

కన్నమ్మకు కూలి ఎంతివ్వాలి? వర్షం పడ్డం వల్ల పనులు ముమ్మరంగా ఉన్నాయి. రోజు కూలీ ఐదు రూపాయలిస్తే కానీ ఎవరూ రారు. ఎప్పుడూ కురవని వాన ఆ ముందు రోజే కురిసింది. వాన మీద విరుచుకుపడ్డాను! వాన లేకపోతే పావలా కూడా ఖర్చు కాకుండా పని జరిగిపోయేది! కన్నమ్మకు ఎంతివ్వాలి?!.... పనికి వెళ్ళకుండా ఇంట్లో పడున్న దానికి పావలా ఇచ్చినా సరిపోతుంది! పావలా కూడా లేకుండా పడుండటం కంటే, పావలా సంపాదించుకోడం దానికి లాభమే కదా! అయినా - అర్ధరూపాయిద్దాం! ఒప్పుకోకపోతే రూపాయిద్దాం! ఇంకా ఒప్పుకోకపోతే - బస్సు రాగానే ఎక్కేసి డబ్బులు బయటకు విసిరేద్దాం. చచ్చినట్టు అదే తీసుకుంటుంది!...

రోడ్డు చేరుకున్నాం. బస్సు వచ్చింది. వెళ్ళిపోయాను.

కన్నమ్మ ఏమీ పుచ్చుకోలేదు! నా తల్లిదండ్రుల నుంచి నేనేమి నేర్చుకోలేదు! మహావృక్షాల ప్రభావంలో నా ఆలోచన అలా తయారైంది! నా చదువు నాకదే నేర్పింది!

కన్నమ్మ మాటలు నేను మర్చిపోలేకపోతున్నాను!

నాలోని నీచమైన దోపిడీ స్వభావం మాత్రం దానికి కారణం కాదు! కాజాలదు! ఎందుకంటే - దోపిడీ స్వభావం దాన్ని నీచత్వంగా అనుకోదు! దాన్ని తెలివిగా అభివృద్ధి మార్గంగా అనుకుంటుంది!! మరెందువల్ల?!...

★ ★ ★

తల్లిదండ్రులు బతికున్నంతకాలం సంవత్సరానికి ఒకటి రెండుసార్లు మా ఊరు వెళుతూ వుండేవాణ్ని. ఆ తరువాత కొద్దిసార్లు మాత్రమే వెళ్లాను. వెళ్లినప్పుడల్లా వృక్షాలనూ - మహావృక్షాలనూ కూడా కలుసుకుంటున్నాను.

కిందటిసారి వెళ్ళినప్పుడు ఒక మహావృక్షం - నాయుడు - ఇంట్లోనే ఉన్నాను. ఏవేవో చెబుతూ మాటల సందర్భంలో కొన్ని మార్పుల గురించి చెప్పేడు.

"... బ్రాహ్మణుల చేతుల్లోంచి భూములు బ్రాహ్మణేతర అగ్రకులాల వారి చేతుల్లోకి వెళ్లేవరకే ఎంతో కొంతవరకూ భూసంస్కరణలు జరిగాయి. ఆ తరువాత రాజ్యాధికారం బ్రాహ్మణేతర అగ్రకులాల వారి చేతుల్లోకి వెళ్ళిపోయింది. వారు ఉన్నత వ్యావసాయక వర్గం వారు కావడం వల్ల ఏదో రూపంలో ఏదో మార్గంలో భూసంస్కరణలు మరింక జరగక్కుండా అడ్డుకుంటూ వస్తున్నారు. పేద రైతుల చేతుల్లోకి భూములు వెళ్ళకుండా అడ్డుకుంటూ వస్తున్నారు. అంతే కాకుండా, పేద రైతుల భూములు పెద్దవారి చేతుల్లోకి వెళ్ళిపోతూ వస్తున్నాయి. భూ సంస్కరణల కోసం జరిగే ఉద్యమాలను నియంతలుగా, నిరంకుశంగా అణచివేస్తూ వస్తున్నారు... ఆ విధంగా ఏవేవో మాటలు విషాదంగా అంతే కాకుండా గర్వంగా చెప్పేస్తూ ఏవేవో మార్పులు చెప్పుకుంటూ వచ్చేడు.

"దోపిడీ వెనుక క్రూరమైన దౌర్జన్యం ఎప్పుడూ ఉంటుంది. కాలక్రమంలో శ్రమ దోపిడీతోపాటు ఆస్తి దోపిడీ కూడా ప్రబలమై పోతూ వస్తోంది. దౌర్జన్యం రక్తపాతంలా వ్యవస్థీకరణ జరిగిపోతోంది" అని కూడా అతడే చెప్పేడు.

కాలసర్పం క్రూరమైంది. క్రూరంగా కఠినంగా కర్కశంగా కఠోరంగా కాలాన్ని కబళించేస్తోంది.

పదవీ విరమణ చేసేశాను. తీరిగ్గా ఉన్నాను. మా ఊళ్లో ఇప్పుడు మాకేమి లేకపోయినా, అక్కడ కొన్ని రోజులు గడపాలనుకున్నాను. ఆ ప్రాంతంలో నాకు చాలా గ్రామాలతో పరిచయం ఉంది. అవన్నీ తిరిగి చూడాలనుకున్నాను.

మా ఊరు వెళ్ళాను. నా స్నేహితుడు దొర ఇంట్లో బస చేశాను. అతడు దొర అవడం వల్ల అతణ్ణి నాయుడని ఎవరు పిల్చినా నాలుక కోసేస్తాడు! అది గుర్తుంచుకుని జాగ్రత్తగా పిలుస్తున్నాను. అతడు మహావృక్ష దశ నుండి మహామహావృక్షంగా మారుతున్న దశలో ఉన్నాడు

దొర ఇంట్లో ఉంటూ రోజుకో ఊరు తిరిగొస్తున్నాను. ఒక్కొక్కప్పుడు రోజుకు రెండో మూడో ఊళ్ళు కూడా చుట్టబెట్టి వస్తున్నాను.

అలా పదిహేను రోజులు గడిపేశాను. వెళ్ళిపోతానని దొరతో చెప్పేను.

ఒకరోజు పూర్తిగా నాతో గడపాలని అన్ని పనులూ మానేసి ఇంట్లో కూర్చున్నాడు.

'నువ్ ఏం చూశావో చెప్పు'

'నువ్ రోజూ ఏం చూస్తున్నావో... నేనూ అదే చూశాను.'

'తప్పించుకోకు... నిజం చెప్పు'

'... అప్పుడెలాగుందో ఇప్పుడూ అలాగే ఉంది. అంతా కంపే. దుర్భరంగా ఉంది. రోడ్లు లేవు. నీళ్లు లేవు. కాలకృత్యాలు తీర్చుకోడానికి సదుపాయాలు లేవు. నడిచే దార్లే గతి... కూలిపోతున్న బడి... చదువులేని బడి.. వైద్యం లేదు. విద్యుత్తులేదు. ఇళ్లు పాతబడిపోయాయి. పడిపోయేలా ఉన్నాయి. ఇంటికప్పులు ఎండిపోయి తాటికమ్మలు జారిపోతున్నాయి. తిండిలేని చిన్న రైతులు... ఉపాధి కోల్పోయిన పేద ప్రజలు... ఎక్కడ చూసినా నిరాశ... విషాదం... నిరుద్యోగం... కన్నీరు... పేదరికం... అభద్రత... భయం... ఒకప్పుడు కూలీలుగా ఉండేవాళ్లు ఇప్పుడిక్కడ కూలిపనులు దొరక్క ఊళ్లు వదిలేసి వలసపోతున్నారు... చిన్న రైతుల భూములు మహావృక్షాల చేతుల్లోకి వెళ్ళిపోవడం వల్ల వారు ఆ భూముల్లోనే కూలీలుగా మారిపోయారు. మధ్యతరగతి రైతులు చిన్న రైతులుగా మారిపోయి, అటు కూలిపనీ - ఇటు చిన్న వ్యవసాయం - చేసుకుంటున్నారు. అలా చెప్పుకుంటూ పోతే చాలా ఉంది..'

కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

'... ప్రజలకు అంత నిస్సహాయంగా పడి ఉండాల్సిన అవసరం ఏముందో నాకు తెలీదు!..." అని అతడు మేకలా గర్జించి పులిలా నవ్వేశాడు.

'మరింకా ఏం చూశావో చెప్పు?' అన్నాడు పులిలా గర్జించి మేకలా నవ్వుతూ.

'ఆనాటి నాలుగైదు వృక్షాలు మహావృక్షాలుగా - ఆనాటి మహావృక్షాలు మహా మహా వృక్షాలుగా పెరిగారు... మరో ఐదారు కొత్త వృక్షాలు వచ్చాయి... నేను వారందర్నీ కలుసుకున్నాను. వారందరూ నా పట్ల స్నేహంగా ప్రేమగా ఉన్నారు. వారి ఆస్తులూ, భవనాలూ, వ్యాపారాలూ, వారి పుత్రుల పెద్ద పెద్ద చదువులూ, ఉద్యోగాలూ - వారి వారి రాజకీయ పదవులూ.. అలా అలా ఎన్నో ఎన్నో విషయాలు నీలాగే వారు కూడా ప్రేమపూర్వకంగా చెప్పేరు. అదంతా మన

ప్రాంతపు అభివృద్ధిగా మన ప్రజల అభివృద్ధిగా చాలా గర్వంగా చెప్పేరు. నాకదంతా ఒహలా కనిపిస్తోంది! మన ప్రాంతమంతా ప్రజలది కానట్లు... పది మందిది మాత్రమే అయిపోయినట్లు... అంతా అంతా అలా కనిపిస్తోంది...'

దొర మౌనంగా ప్రశాంతంగా ప్రేమగా స్నేహంగా చిరునవ్వుతో నా మొహంలోకి చూస్తూ నేను చెప్పిందంతా విన్నాడు. నేను మౌనంగా ఉండిపోయాను.

కొద్ది క్షణాల తరువాత నోరు విప్పేడు.

"... సిద్ధాంతం - ఆశయం - ఆదర్శం - ఆచరణ - ప్రజావిశ్వాసం - ప్రజల పట్ల బాధ్యత - ఉన్న రాజకీయ పార్టీ ఇవాళ ఏ ఒక్కటీ లేదు. రాజ్యాధికారం మాత్రమే కావాల్సిన అవకాశవాద బందిపోటు - వెన్నుపోటు - రాజకీయ ముఠాలు ఏర్పడిపోయాయి... రాజ్యాధికారంలో రొట్టెముక్క - కావాల్సినంత రొట్టెముక్క దొరకని వాళ్లు - ఎవరి ముఠా వాళ్లు ఏర్పర్చుకుంటూ వస్తున్నారు. రాజ్యాధికార మృగ కామంలో ధనాధిపత్య పశుకామంలో - ప్రజలు లేని, ప్రజా విశ్వాసమనే ప్రాణం లేని ప్రజాస్వామ్య శవాన్ని జబ్బ బలం కల దోపిడీ రాజకీయ ముఠాలు మోస్తున్నారు. నేను కూడా అంతే! నేనూ మోస్తున్నాను...! ధనిక స్వామ్యం పెట్టుబడిదారీ స్వామ్యంగా - కార్పొరేట్ పెట్టుబడిదారీ స్వామ్యంగా - పరిణామం చెందుతూ వస్తోంది. ప్రపంచీకరణ ప్రభావంలో కార్పొరేట్ పెట్టుబడిదారీ స్వామ్యం - మళ్లీ కార్పొరేట్ ధనికస్వామ్యంలోకి వెళ్ళిపోతోంది. వృక్షాలూ - మహా వృక్షాలూ కూడా - కూలిపోవచ్చు. మహామహా వృక్షాలు మాత్రమే ఉంటాయి..." ఆ విధంగా అతడు చిరు విషాదంలో మహా ప్రశాంతంగా మనసు విప్పి చెప్పి నా పట్ల ప్రేమను చూపించేడు.

పెద్దవారితో పరిచయం వల్ల ఎన్నో తెలుసుకోగలం!

★ ★ ★

ఆరోజు తిరుగు ప్రయాణం. కన్నమ్మ ఇంటికి వెళ్లాను.

కన్నమ్మ ఇంటి ముందు తాటి తడవల కుక్కి మంచం మీద కూర్చున్నాను. వాళ్లతో ఏవేవో మాట్లాడుతున్నాను. కన్నమ్మ మనుమరాలు కాళి గరువులోంచి వస్తోంది. పదో తరగతి చదివి మానేసిందట. మిగిలిన చిన్న గరువు ముక్కలో కూరగాయలు పండిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.

నేనెవరో కాళికి తెలీదు. నన్ను చూసింది. మహావృక్షాల మనిషి ననుకుందో ఏమో నిప్పులు కురుస్తూ నా దగ్గరకు వచ్చేసింది.

"... నెగు! నెగిసెల్లిపో! నీ మొగమెలగుందో నీకు తెలుసా?... అద్దవిత్తాను సూసుకో!... మా బతుకులు మింగేసే పులినాగుంది. మా బతుకులు కాటేసే పాము నాగుంది! నెగు! నెగిసెల్లిపో! ఇంకా మాకాడ మా ఊళ్లల్లో ఏదైనా బూవి మిగిలి ఉందేమో మింగేద్దావని ఒచ్చినట్టున్నావ్. ఏదైనా ఇంకా ఉండిపోయిందేమో తన్నుకు పోదావని వచ్చినట్టున్నావ్! నెగు! నెగిసెల్లిపో! నేకపోతే పీకట్టుకొని ఊరు బయట గెడ్డల్లోకి ఇసిరేత్తా! నాను అగ్గిమంటనని నీకు తెల్దేటి? ఆళ్ళేరీ! ఆ బోకరు గాళ్ళేరీ! ఆ తారుపుగాళ్ళేరీ? ఆళ్లు కార్యకర్తలంట కార్యకర్తలు! మేకలను జంపి పులులను మేపేరగిడీనులు! ఆళ్లే రాజ్జేన్ని నడపతున్నారు. ఆళ్లని జుత్తట్టుకు గుంజి గుండెల మీద గుద్ది మక్కలిరగదంతే... నీలాటోళ్లు కాళ్లు తెగిన పచ్చినాగ విలవిల కొట్టుకుంటూ గూకుంతారు. మరింక నెగు! మరేదగా ఎల్లు!... ఏరీ ఆ తారుపుగోళ్లు? ఆళ్లేరీ...?!

కాళి మహాజ్వాలగా విరుచుకుపడిపోతోంది. ఆమె నెవరూ అడ్డుకోలేకపోయారు. ఆమె చెప్పినట్లే నేను మర్యాదగా లేచి వెళ్లిపోయాను.

★ ★ ★

అటు కన్నమ్మ మాటలు గానీ - ఇటు కాళిమాటలు గానీ - నేను మర్చిపోలేకపోతున్నాను!

స్వచ్ఛమైన ప్రేమ - దోపిడీ హింసలమీద తిరుగుబాటు - ఆ రెండూ కూడా మహోన్నతమైన సామాజిక జీవన విలువలని నేను అనుకుంటున్నాను!

★ ★ ★

(ఆదివారం ఆంధ్రభూమి - 23.02.2003)